సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 26 । జూన్ । 2023



నర్సరీల్లో 'నారు'
గుడిహత్నూర్ మండలంలో వాణిజ్య పంటల తో పాటు కొందరు రైతులు కేవలం కూర గాయల పంటలపైనే ఆధారపడి వ్యవ సాయం చేస్తున్నారు. 9లో▸



మాకేది..'పెట్టుబడి'?
రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ప్రవేశ పెట్టిన రైతుబంధు కౌలు రైతులకు అందడం లేదు. దీంతో పంటల పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
28.5/24.0

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'నేడు పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న రేసు మనోజ్‌రెడ్డి

బేల(ఆదిలాబాద్): ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నేడు నిర్వహించనున్న పాఠశాలల బంద్ విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేసు మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడ హరీష్‌రెడ్డి, సభ్యులు గుంజేవార్ మహేష్, ప్రీతం, సాయి, సూరజ్, వంశీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి'

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ పట్టణ కన్వీనర్ అక్షయ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో నాయకులు అరుణ్, శ్రీవర్ధన్, అఖిలేష్, నిలేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తెలిపారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని నానాపటేల్ నగర్, డాల్డా కంపెనీ, నెహ్రూనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ వరంగల్, సరూర్‌నగర్ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. రైతులకు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇంట్లో వృద్ధులు ఉంటే రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, పట్టణ అధ్యక్షుడు నగేష్, నాయకులు సంజీవ్‌రెడ్డి, హని, రసూల్, నజీర్, జాబీర్, తదితరులు పాల్గొన్నారు.

'చలో ఈఎన్‌సీ' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న చేపట్టనున్న చలో ఈఎన్‌సీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్ కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ (ఇంజినీర్ చీఫ్ కార్యాలయం) ముట్టడి కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమానికి మిషన్ భగీరథ కార్మికులు తరలిరావాలని కోరారు. సమావేశంలో వినోద్, గజ్జు, నితిన్, సాయి, రవి, అశోక్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు.

- ఇదివరకు ఆదిలాబాద్ రూరల్, మావలలో పనిచేసి ప్రస్తుతం పట్టణంలోని ఓ టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఎస్సై తన బంధువైన రాజకీయ నాయకుడి ద్వారా సమీప జిల్లాలో పోస్టింగ్ కోసం ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించి ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా పోలీస్‌శాఖలో చర్చ సాగుతోంది.
- కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఇటీవలే బోథ్ నియోజకవర్గంలోని ఓ మండలానికి తహసీల్దార్‌గా బదిలీ అయిన అధికారి తిరిగి అదే పోస్టులోకి వచ్చేందుకు ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించినట్లు తెలిసింది. ఎన్నికల బదిలీని తప్పించుకునేందుకు సదరు అధికారి వేసిన ఎత్తుగడను గ్రహించిన ఆ ప్రజాప్రతినిధి సదరు అధికారిని తీవ్రంగా మందలించినట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతోంది.
- మూణ్నెళ్ల క్రితం వరకు ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మంచి ఆదాయం కలిగిన ఓ మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి ఎన్నికల బదిలీని తప్పించుకునేందుకు తన రాజకీయ పరపతిని ఉపయోగించుకుని కలెక్టరేట్‌లో పోస్టింగ్ పొందారనే ప్రచారం రెవెన్యూ వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గత ఎన్నికల్లోనూ సదరు అధికారి ఈసీ బదిలీని తప్పించుకుని జిల్లాలోనే పనిచేసినట్లుగా తెలుస్తోంది.

బదిలీలు.. పైరవీలు!



జిల్లా కలెక్టర్ కార్యాలయం

- ఎన్నికల వేళ ఊపందుకున్న వైనం
- దూరం వెళ్లకుండా ఉండేందుకు యత్నాలు
- ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్న అధికారులు
- ఈసీకి వెళ్లకముందే కొత్త పోస్టింగ్ కోసం ఆరాటం

కైలాస్‌నగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎన్నికల ప్రక్రియతో ప్రత్యక్ష సంబంధం ఉండే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల్లో బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకే జిల్లాలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారు, సొంత జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించడం ఈసీ నిబంధనలకు విరుద్ధం. ఇలాంటి వారి బదిలీలను జూలై నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించింది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈసీ బదిలీలతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, ఏడాది వరకు తిరిగి జిల్లాకు వచ్చే అవకాశం ఉండదని భావిస్తున్న కొంతమంది అధికారులు పైరవీలకు తెర లేపారు. ఈసీ బదిలీలలోపే జిల్లా, సమీప జిల్లాల్లో కొత్త పోస్టింగ్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ నాయకుల ద్వారా ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తూ బదిలీల కోసం జోరుగా పైరవీలు చేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఈసీ బదిలీతో ఏడాది దూరమే

సొంత జిల్లా అధికారులు, 2024 జనవరి 31 నాటికి ఒకే జిల్లాలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారు ఆ జిల్లాలో పనిచేయకూడదని ఈసీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు బదిలీలు తప్పనిసరి. జిల్లా యంత్రాంగం ఇలాంటి వారి వివరాలతో అందించే సమాచారం ఆధారంగా ఈసీ బదిలీలు చేపట్టనుంది. జూలై నెలాఖరు వరకు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలనే ఈసీ ఆదేశాలతో ఏ అధికారి ఏ జిల్లాకు వెళ్లాల్సి వస్తుందో తెలియని పరిస్థితి. బదిలీ జరిగి దూర ప్రాంతానికి వెళ్తే అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకూ తిరిగి వచ్చేందుకు అవకాశం ఉండదు. ఆ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్లమెంట్ ఎన్నికలు సైతం జరిగే అవకాశముంది. కనుక ఏడాది వరకు బదిలీ జరిగిన చోటే పనిచేయాల్సి ఉంటుంది. దీంతో కొంతమంది అధికారులు ఇప్పటి నుంచే పైరవీలు షురు చేశారు. ఈసీ బదిలీల కంటే ముందుగానే కొత్త పోస్టింగ్ తెచ్చుకుంటే కోరుకున్న చోటుకు వెళ్లవచ్చని తద్వారా ఎలాంటి ఇబ్బందులుండవనే ఉద్దేశంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తూ తమను కొత్త చోటుకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

వారిని కదిలిస్తారా? కనికరిస్తారా?

మూడేళ్ల సర్వీస్ పూర్తయిన అనుభవజ్ఞులైన అధికారుల అవసరం ఉంటుందని కలెక్టర్ భావిస్తే ఈసీ అనుమతితో కొంతమందికి మినహాయింపు లభించవచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లుగా పనిచేస్తున్న నలుగురు జిల్లా వాసులే. ఇందులో ఒకరు ఏడేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు. కలెక్టరేట్ ఏవో ఎనిమిదేళ్లుగా ఒకేచోట కొనసాగుతున్నారు. ఈ అధికారులను నిబంధనల మేరకు ఇక్కడి నుంచి కదిలిస్తారా? కనికరిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా పీఆర్ అధికారులు కూడా

ఈ సారి కొత్తగా పంచాయతీరాజ్ విభాగ అధికారులకు కూడా బదిలీ తప్పదని తాజాగా వచ్చిన ఆదేశాల ప్రకారం స్పష్టమవుతోంది. సొంత జిల్లా వాసులతో పాటు మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఎంపీడీవో, ఎంపీవో వివరాలు తమకు పంపించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆ వివరాల సేకరణలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలోని జిల్లా పరిషత్, ఎంపీడీవో కార్యాలయాల్లో మొత్తం 40కి పైగా అధికారులు సొంత జిల్లా వారే విధులు నిర్వహిస్తున్నారు. మరి వీరిని బదిలీ చేస్తారా? లేక ఇక్కడే అదనపు విధులు కేటాయిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

వీరికి బదిలీ తప్పనిసరి

కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ విధుల్లో చేరి మూడేళ్ల సర్వీస్ ఇంకా పూర్తి కాలేదు. దీంతో వీరి ఆధ్వర్యంలోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశముంది. రెవెన్యూలో ఇద్దరు ఆర్డీవోలు, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న 25 మంది తహసీల్దార్లు జిల్లా వాసులే. వీరంతా తప్పనిసరి బదిలీ కింద ఇతర జిల్లాలకు వెళ్లక తప్పని పరిస్థితి. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఒకరిద్దరికి మినహాయింపు లభించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీస్‌శాఖలో 40మంది ఎస్సైలు, ఏడుగురు సీఐలు, ఇద్దరు డీఎస్పీలు పనిచేస్తున్నారు. ఇటీవల సీఐలను బదిలీ చేశారు. జిల్లాలో ఆదిలాబాద్ టూ టౌన్, రూరల్, ఉట్నూర్, బోథ్, ట్రాఫిక్ , ఇచ్చోడ సీఐ లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ సీబదిలీలకు ముందే ఈ బదిలీలు జరగడం గమనార్హం.

పఠనోత్సవం

- నేటి నుంచి 'రీడింగ్ క్యాంపెయిన్'
- జూలై 31 వరకు నిర్వహణ
- 1 నుంచి 10 తరగతుల విద్యార్థులు ధారాళంగా చదివేలా చర్యలు
- కార్యక్రమం పకడ్బందీగా జరిగేనా?



తరగతిగదిలో విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో డీఈవో పరిధిలోని పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
ఆదిలాబాద్	693	69,623
కుమురంభీం	747	65,365
నిర్మల్	747	55,749
మంచిర్యాల	737	47,747

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠ్యాంశాలు, దినపత్రికలు, ఇతర అంశాలు చదవడంలో చాలామంది విద్యార్థులు తడబడుతున్నారు. దీన్ని సరిదిద్దేందుకు పాఠశాల విద్యా శాఖ 'పఠనోత్సవం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 26 నుంచి జూలై 31 వరకు కార్యక్రమం కొనసాగనుంది. విద్యార్థులు ధారళంగా చదవడంతో పాటు నిత్యం చదవడం అలవాటుగా మార్చుకునేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుంది. అయితే చదువుపై విద్యార్థుల్లో ఏ మేరకు ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే. గతంలో చేపట్టిన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ఫలితాలివ్వలేదు. ఈ కార్యక్రమమైనా సత్ఫలితాలు ఇచ్చేవిధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రతీరోజు ఒక పీరియడ్

ఉమ్మడి జిల్లాలో డీఈవో పరిధిలోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 35 రోజుల పాటు కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతీ తరగతికి ప్రత్యేకంగా పఠన పీరియడ్ కేటాయించారు. విద్యార్థులందర్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేసి కఠిన పదాలు, సరళ పదాలు, బోర్డుపై రాసిన పదాలు, గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలు చదివించేలా చూస్తారు. ప్రతీరోజు ప్రార్థన సమయంలో ఏదో ఒక అంశాన్ని చదివేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులు మాతృభాషలో, రెండు రోజులు ఆంగ్లంలో, ఒకరోజు ద్వితీయ భాషలో చదివించేలా చర్యలు చేపట్టనున్నారు. పిల్లల్లో మరింత ఆసక్తి పెంచేందుకు కథల పుస్తకాలను చదివిస్తారు.

విద్యార్థులకు పోటీలు..

పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యార్థులకు వారానికి ఒకసారి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు చదువుతున్న తీరును వివరిస్తారు. దీంతో పాఠశాలల్లో ప్రజల భాగస్వామ్యం ఏర్పడుతుంది. ప్రతీ శనివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారి పఠన తీరును పర్యవేక్షిస్తారు. గ్రంథాలయంలో గల పుస్తకాలకు సంబంధించి విద్యార్థుల ద్వారా కమిటీలను ఏర్పాటు చేస్తారు. తోటి విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడం, రికార్డులో రాయడం, తదితర వాటిని చేపడతారు.

వారోత్సవాల నిర్వహణ..

పఠనోత్సవంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 2,924 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు చేపడుతున్నారు. జూలై 10 నుంచి ఆగస్టు 15 వరకు కార్యక్రమం కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథల పుస్తకాలను చదివిస్తారు. దినపత్రికల్లో వచ్చిన మ్యాగ్జిన్‌లు, బొమ్మలను సేకరించి కార్డున్‌లను తయారు చేసేలా చూస్తారు. ఇందులో భాగంగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి కమిటీ పర్యవేక్షించనుంది.

పకడ్బందీగా అమలయ్యేనా?

కార్యక్రమం ఉద్దేశం మంచిదైనా చాలా మంది ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పనిచేయకపోవడంతో గతంలో నిర్వహించిన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. అభ్యసన, త్రీఆర్స్, తొలిమెట్టు, తదితర కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన స్థాయిలో జరగలేదు. అధికారుల పర్యవేక్షణ, కొంత మంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. ఈ కార్యక్రమాన్ని అయినా పకడ్బందీగా అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరగనుంది.

పఠన సామర్థ్యం పెంచేలా..



విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించేందుకు నేటి నుంచి జూలై 31 వరకు అన్ని పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలయ్యేలా చూస్తాం. రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీలు పర్యవేక్షణ చేపడతాయి.
– ప్రణీత, డీఈవో

రాష్ట్రంలో రాక్షస పాలన..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

జైనథ్(ఆదిలాబాద్): ఎందరో అమరుల త్యాగ ఫలితంగా సాధించిన తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మండిపడ్డారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గిమ్మలో కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బీజేపీ పథకాలపై ప్రజలకు వివరించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పక్కనే ఉన్న కోర్ట చనాఖా బ్యారేజీ నిర్మాణంలో రైతులకు తీవ్ర అన్యాయం చేసారన్నారు. ఎకరానికి కేవలం రూ.5 నుంచి 6 లక్షలు మాత్రమే చెల్లించి భూములు తీసుకోవడంతో రైతులు తీవ్రంగా మోసపోయారన్నారు. రైతులకు వెంటనే అదనపు నష్ట పరిహారంతో పాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, వ్యవసాయ భూములు అందించాలని డిమాండ్ చేసారు. అవినీతి, కమీషన్లతో చెలరేగిపోతున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. జ్యోతిరెడ్డి, ముకుంద్‌రావ్, కట్కం రాందాస్, రమేశ్, సన్నీ, శ్రీకాంత్, గజానన్, భూమన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి కోరలు చాచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 46, 47వ వార్డుల్లో తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశం అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమ స్వప్న రవి, నాయకులు రత్నాకర్‌రెడ్డి, ముకుంద్, విజయ బోయర్, ధోని జ్యోతి, సాయి, వరుణ్, భూపేందర్ పాల్గొన్నారు.



గిమ్మలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాయల్ శంకర్



అస్తవ్యస్తపు పనులు.. ప్రమాదాలకు నెలవు

ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ నుంచి వినాయక్ చౌక్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వివేకానంద చౌక్ వద్ద రహదారి మధ్యలో పైపులైన్ ఉండడంతో మధ్యలోనే వదిలేశారు. సంబంధిత స్థలంలో ఎటువంటి హెచ్చరిక బోర్డు పెట్టకుండా.. కేవలం ఒక తెల్లని వస్త్రాన్ని ఒక జెండా లాగా ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేలలో తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలి

- జూలై మొదటి వారం వరకు సోయా, రెండో వారంలో పత్తికి అనుకూలం
- అదను దాటితే దీర్ఘకాల పంటలకు అవకాశం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: నేలలో తేమశాతం ఉన్నప్పుడే సోయా, పత్తి విత్తనాలు విత్తుకోవాలి.. ఇప్పటి వరకు ఆశించిన స్థాయి వర్షాలు కురువలేదు.. తొందరపడి రైతులు విత్తనాలు విత్తుకొని నష్టపోవద్దు.. మంచి వర్షాలు నమోదైతే జూలై మొదటి వారం వరకు సోయా, నెలాఖరు వరకు పత్తి విత్తుకోవచ్చు.. జూలై మాసం దాటితే కంది వంటి దీర్ఘకాల పంటలను సాగు చేసుకోవచ్చు. జిల్లాలో రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి.. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య అన్నారు. వానాకాలం సాగు నేపథ్యంలో ఆదివారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి రైతులు ఫోన్‌చేసి తమ సందేహాలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని నివృత్తి చేస్తూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏఓ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రశ్న: రాశి-659 విత్తనాల కొరత తీవ్రంగా ఉంది. ఈ విత్తనం అడిగితే లింక్ పెడుతున్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు? (మహేందర్, సాంగిడి, బేల)

డీఏవో: జిల్లాలో విత్తనాల కొరత లేదు. 1.20 లక్షల రాశి-659 విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా లింక్ పెట్టి విక్రయిస్తే వారిపై చర్యలు చేపడతాం. విత్తనాలు, ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి. రైతులు తప్పనిసరిగా రశీదు పొంది పంట పూర్తయ్యే వరకు భద్రపర్చాలి. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: స్ప్రింక్లర్లపై సబ్సిడీ ఎత్తివేశారు. సబ్సిడీపై వాటిని అందించేందుకు ఏమైనా చర్యలు చేపడుతున్నారా? (ఉమేష్ వైద్య, తాంసి(కె),భీంపూర్)

డీఏవో: కరోనా సమయం నుంచి ప్రభుత్వం స్ప్రింక్లర్లపై సబ్సిడీని ఎత్తివేసింది. యాసంగి సాగుకు అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటిదేమైనా ఉంటే రైతులు దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందవచ్చు.

ప్రశ్న: అధిక సాంద్రత విధానంలో సాగయ్యే పత్తికి సబ్సిడీ ఇస్తున్నారా? మేము సాగు చేసే పంటకు సబ్సిడీ వర్తిస్తుందా.? (విజయ్, కొల్హారి, గుడిహత్నూర్)

డీఏవో: అధిక సాంద్రత సాగుకు సంబంధించి వెరైటీ, సబ్సిడీలతో కూడిన ప్రణాళిక జూన్ 13, 14 తేదీల్లోనే వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక ఇవ్వలేదు. సొంతంగా సాగు చేసుకోవచ్చు. కానీ అందుకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇవ్వదు.



'సాక్షి' ఫోన్‌ఇన్‌లో రైతుల సందేహాలు నివృత్తి చేస్తున్న డీఏవో పుల్లయ్య

ప్రశ్న: సోయా ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చు. పత్తి విత్తాం. గడ్డి మందు పిచికారీ చేయవచ్చా ?(మహేందర్, తేజాపూర్, నేరడిగొండ), (శ్రీరంగ్ దేవ్‌తాడే, లింగాపూర్, గుడిహత్నూర్), (దశరథ్, మసాల(కె), బేల)

డీఏవో: సోయా పంటను జూలై మొదటి వారం వరకు సాగు చేసుకోవచ్చు. కానీ నేలలో తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు విత్తుకోవాలి. జూలై చివరి వారం వరకు పత్తి పంటను సాగు చేయవచ్చు. గడ్డి మందు పిచికారీ చేయాలన్నా నేలలో తేమ కాస్త ఉండాలి. ఎకరానికి 300 మి.మీ.ల మందును పిచికారీ చేయవచ్చు. డీఏపీ కంటే పీఎస్పీ పాస్పరస్ సాలెబుల్ బ్యాక్టీరియాను చల్లడం ఎంతో ఉత్తమం. కిలో పీఎస్పీ చల్లడం ద్వారా నేలలో ఉన్న భాస్వరం అంతా కరిగి మొక్క దృఢంగా ఎదిగేందుకు ఉపకరిస్తుంది. పైగా పెట్టుబడి సైతం తగ్గుతుంది.

ప్రశ్న: పత్తి విత్తనం వేసిన ఎన్నిరోజుల్లోపు గడ్డి మందు పిచికారీ చేయవచ్చు? (ఆనంద్‌రావు, లక్ష్మీపూర్, జైనథ్)

డీఏవో: పత్తి గింజలు పెట్టిన 24 నుంచి 48 గంటల వరకు గడ్డి మందు స్ప్రే చేయవచ్చు. అయితే నేలలో తడి ఉండాలి. మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల మధ్యలో మరోసారి పిచికారీ చేయవచ్చు. 60 నుంచి 70 శాతం తేమ ఉంటే ఎకరాకు 250 మిల్లీలీటర్ల ఇన్‌స్టాబిడ్, 300 మిల్లీలీటర్ల సొసైటీ మందులను పిచికారీ చేయవచ్చు.

ప్రశ్న: వానాకాలంలో మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేయవచ్చా. చీడపీడలను ఎలా నియంత్రించవచ్చు? (పెందూర్ అనిల్ కుమార్, సర్పంచ్, రిమ్మ, సిరికొండ)

డీఏవో: మొక్కజొన్న పంటను సాగు చేసుకోవచ్చు. మంచి వర్షాలు కురిస్తే కత్తెర పురుగు సోకే అవకాశం ఉంది. దీని నియంత్రణకు 24 గుళికలను చల్లుకోవాలి. వానాకాలంలో శనగ పంటను సాగు చేయవద్దు. అధిక వర్షాలకు పంట దిగుబడి రాకపోవడమే కాకుండా పంట కోసే సమయంలో వర్షాలతో నష్టపోయే అవకాశం ఉంది.

ప్రశ్న: సోయా సాగు ఆలస్యమవుతోంది. వర్షాలు ఎప్పటినుంచి కురుస్తాయి? (ఆశిష్, జైనథ్), (శ్రీనివాస్ టెంర్డ, బజార్‌హత్నూర్)

డీఏవో: నైరుతి రుతుపవనాలు ఇప్పుడిప్పుడే ప్రవేశిస్తున్నాయి. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు కురిస్తే జూలై మొదటి వారం వరకు సోయాబీన్ పంట సాగు చేయవచ్చు. లేదంటే కంది, పత్తి పంటలను సాగు చేయడం ఉత్తమం.

ప్రశ్న: సోయా పంటను ఎప్పటివరకు సాగు చేయవచ్చు. ఎలాంటి రకం సాగు చేస్తే మంచిది?(గుండి శ్యామ్‌సుందర్, మచ్చాపూర్, గుడిహత్నూర్)

డీఏవో: నల్లరేగడి నేలల్లోనే సోయా పంటను సాగు చేయాలి. చెలకల్లో ఈ పంట సాగు చేస్తే దిగుబడి రాక నష్టపోయే అవకాశం ఉంటుంది. విక్రాంత్, కరిష్మ, ఈగల్ 335 వంటి రకాల విత్తనాలను విత్తుకోవచ్చు. వాటిద్వారా దిగుబడి వస్తుంది.

ప్రశ్న: జిల్లాలో ఎరువులు అందుబాటులో ఉన్నాయా? (శ్రీనివాస్, డోప్టాల, బేల)

డీఏవో: జిల్లాలో 27,667 టన్నుల యూరియా, 6172 టన్నుల డీఏపీ, 472 టన్నుల పొటాష్, 21వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

ప్రశ్న: జిల్లా సాధారణ వర్షపాతం ఎంత. ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం ఎంత? (రాకేష్, బోథ్)

డీఏవో: జిల్లా సాధారణ వర్షపాతం 151.3 మి.మీ.లు. ఇప్పటి వరకు 30.7 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో అత్యల్పంగా వర్షం కురిసింది.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు కానున్న మహాత్మా జ్యోతి భాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గోపిచంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ mjptbcwreir.teanfana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సజావుగా సీఆర్టీల నియామకపరీక్ష



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ఐదు కేంద్రాల్లో సీఆర్టీల నియామకపరీక్ష శుక్రవారం సజావుగా నిర్వహించినట్లు ఐటీడీఏ డీడీ డా. దిలీప్‌కుమార్ తెలిపారు. మొత్తం 1818 అభ్యర్థులకు గాను 1691 మంది హాజరయ్యారని 127 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసీఎంవోతో కలిసి అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక పరిశీలకులుగా ఏటీడీవోలు, జేసీడీవో, స్పోర్ట్స్ అధికారులు వ్యవహరించారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌లో పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడులు చేయగా, 9మంది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి పేకాట ముక్కలతోపాటు రూ.17,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పంట పొలాల్లోని విద్యుత్ సర్వీస్ కేబుల్ చోరీ

మందమర్రిరూరల్: సారంగపల్లి పంచాయతీ పరిధిలోని పలువురు రైతుల పంట పొలాల్లోని విద్యుత్ మీటర్ నుంచి బోర్ వరకు ఉన్న సర్వీస్ కేబుల్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఆదివారం 8 మంది రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ విద్యుత్ స్తంభం నుంచి సుమారు 15మీటర్ల మేరకు సర్వీస్ కేబులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అసలే పంటల సమయం కేబుల్ వైర్ చోరీకి గురికావడంతో చాలా ఇబ్బంది అవుతుందని, దొంగలను గుర్తించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చిల్కూరిలక్ష్మి నగర్‌కు చెందిన మూగ, చెవిటి యువకుడు సిరాజ్‌ఖాన్ గత రెండు రోజులుగా అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఆ కాలనీకి చెందిన సిరాజ్‌ఖాన్ ఈనెల 23న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటి చేరుకోకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఆయన తండ్రి అక్రమ్‌ఖాన్ ఆదివారం టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మాకేది పెట్టుబడి?



దుక్కి దున్నుతున్న కౌలు రైతు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది సంతోష్. ఈయనది మర్లపెల్లి స్వగ్రామం, బోథ్ మండలం. గ్రామంలో ఆరు ఎకరాల భూమిని రూ.80 వేలకు కౌలుకు తీసుకున్నాడు. ఐదెకరాల్లో శనగ పంట వేశాడు. నీటి కొరత, విద్యుత్ సమస్యతో పంటలకు సరిపడా నీరందించలేదు. మొత్తం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దాదాపు రూ.70 వేలు ఖర్చు చేశాడు. కనీసం పెట్టిన పెట్టుబడికూడా రాలేదని వాపోయాడు. ఇదీ ఉమ్మడి జిల్లాలోని కౌలు రైతులందరి పరిస్థితి.

- కౌలు రైతులకు అందని పథకాలు
- వర్తించని రైతుబీమా, రైతుబంధు
- తమకూ పథకాలు అందివ్వాలని వేడుకోలు

బోథ్: సొంత భూమి లేదు..బ్యాంక్‌కు వెళ్తే రూపాయి రుణం పుట్టదు. తమ జీవనం కొనసాగాలంటే వ్యవసాయం చేయక తప్పదు. అప్పోసప్పో చేసి భూములను కౌలుకు తీసుకుని ఉమ్మడి జిల్లా రైతులు పంటలు పండిస్తున్నారు. సాగులో ఎన్ని ఆటంకాలు వచ్చినా నష్టాలు ఎదురైనా భరిస్తున్నారు. అప్పు చేసి పంటలు సాగు చేసినా దిగుబడి రాక నష్టాలపాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందని పరిస్థితి. భూ యజమానులకే మాత్రమే రైతుబంధు, రైతుబీమా వర్తించడంతో తమను విస్మరించడంతో పెట్టుబడి సాయం, ఇతరత్రా పథకాలను దూరమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో.. కౌలు రైతుల వివరాలు

అదిలాబాద్	28,763
నిర్మల్	33,212
కుమురంభీం	26,584
మంచిర్యాల	28,584
మొత్తం గుర్తింపు కార్డులున్నా వారు	5314
ఆత్మహత్యలు చేసుకున్నవారు	330

కౌలు గుర్తింపు కార్డులేవి?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,143 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 5314 మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కార్డులు జారీ చేయాలంటే భూ యజమానులు కౌలుకు ఇస్తున్నట్లు అంగీకారం తెలపాల్సి ఉంటుంది. కాని వారు కౌలునామా పత్రాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,17,143 మంది కౌలు రైతులు ప్రభుత్వం అందించే పంట రుణం, రాయితీ విత్తనాలు తీసుకునే అవకాశం లేకుండా పోతోంది.

అందని రైతుబంధు

రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం కౌలు రైతులకు అందడం లేదు. వ్యవసాయం చేయకున్నా భూ యజమానులు రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10 వేలు తీసుకుంటున్నారు. కాని వారి భూముల్లో నిజంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి పైసా అందడం లేదు. కనీసం రుణాలు అందకపోవడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు సరిగా పండకపోతే లక్షల్లో అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితులు ఉన్నాయని వారు వాపోతున్నారు.

పథకాలు వర్తింపజేయాలి



రైతులకు మాదిరిగా కౌలు రైతులకు ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా ఇతర పథకాలు వర్తింపజేయాలి. ప్రభుత్వం నుంచి సాయం అందక నష్టపోతున్నారు. ఈ పరిస్థితులు ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తున్నాయి. ప్రభుత్వం వారికి రైతుబంధు, రైతు బీమా అందజేయాలి.
– బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

బీజేపీలో ఏం జరుగుతోంది?



సోయం బాపూరావు



పాయల్ శంకర్



రాథోడ్ రమేశ్



సుహాసినీరెడ్డి

- ఎంపీ సోయం వ్యాఖ్యల వీడియో, ఖండన తీరు పార్టీలో దుమారం
- అంతర్గత వ్యవహారం బయటకు తేవడం వెనుక వ్యూహం అనే చర్చ
- రాథోడ్ రమేశ్, పాయల్ శంకర్‌పై ఎంపీ విమర్శలు
- మరో వ్యవహారంలో జిల్లా క్రమశిక్షణ కమిటీపై అధిష్టానానికి సుహాసినీరెడ్డి ఫిర్యాదు

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీలో ఏం జరుగుతోందని ప్రస్తుతం ఆ పార్టీలోని సామాన్య కార్యకర్త నుంచి మొదలుకుని ముఖ్యనేతల వరకు ఇదే చర్చ సాగుతోంది. ఎంపీ సోయం బాపూరావు ఎంపీ ల్యాడ్స్ పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో బయటకు రావడం, వాటిని ఖండిస్తూ సోయం ముఖ్యనేతలు రాథోడ్ రమేశ్, పాయల్ శంకర్‌పై సూటిగా విమర్శలు గుప్పించడం పార్టీలో చర్చకు దారితీసింది. ఇదిలా ఉంటే ఐదు రోజుల తర్వాత ఆ వీడియో క్లిప్‌ను బయటకు తీసుకురావడంలో వ్యూహం ఉందనే చర్చ సాగుతోంది. మొత్తంగా పార్టీలో ముఖ్యనేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయన్నది ప్రస్ఫుటం అవుతోంది.

వరుస పరిణామాలు

రెండేళ్లుగా బీజేపీలో జరుగుతున్న పరిణామాలు పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంటున్నాయనే ది సామాన్య కార్యకర్తలోనూ వ్యక్తమవుతున్న అభిప్రాయం. కరోనా సమయంలో ఓ బీజేపీ నేత కు సంబంధించిన ఫౌండేషన్‌కు రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్ ఇచ్చినట్లు బహిర్గతం కావడం తీవ్ర దుమారం రేపింది. ఇచ్చోడలో ఓ అసైన్డ్ భూమికి సంబంధించిన వ్యవహారంలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఒకరితో తీవ్రస్థాయి పదజాలంతో మాట్లాడిన ఆడియో క్లిప్ బయటకు వచ్చింది. అప్పట్లో ఇది తీవ్ర దుమారం లేపింది. కొద్దిరోజుల క్రితం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి రేణుక సిమెంట్ భూముల వ్యవహారంలో కొంతమంది పార్టీ నేతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి జిల్లా క్రమశిక్షణ కమిటీ వివరణ కోరడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీలో అనేక సంఘటనలు జరుగుతున్నప్పటికీ వాటికి సంబంధించి క్రమ శిక్షణ కమిటీ పట్టించుకోదని, కేవలం తన కోసమే ఈ కమిటీని నియమించారా? అని ఆమె ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆమె రాష్ట్ర క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయడం తాజాగా సంచలనం కలిగిస్తోంది. ఈ పరిణామాలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.

ఎంపీ ల్యాడ్స్ దుమారం..

గడిచిన సోమవారం ఎంపీ సోయం బాపూరావు ఆదిలాబాద్‌లో ఎంపీటీసీలు, కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అది అంతకుముందు ఐదురోజుల క్రితం జరి గిన కార్యక్రమానికి సంబంధించిందని చెప్పుకుంటున్నారు. ఈ క్లిప్‌లో సోయం బాపూరావు ఎంపీ ల్యాడ్స్‌పై మాట్లాడటం జరిగింది. ప్రధానంగా పార్టీ ఎంపీటీసీలకు, కౌన్సిలర్లకు ఇప్పటివరకు ఈ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాటల్లో ఉంది. తాజాగా వచ్చిన రూ.5 కోట్ల నిధుల్లో అందరికి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా మొదట్లో నిధులను ఇవ్వలేకపోవడంపై కారణం తెలుపుతూ ఇంటి నిర్మాణం, కుమారుడి పెళ్లి విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై తీవ్ర దుమారం లేవడంతో తలమడుగులో ప్రస్తావించిన ఆ వ్యాఖ్యల్లో తీరుమారిందని చెప్పుకుంటూ వస్తూ ఇల్లు కట్టడం, మ్యారేజ్‌లో బిజీగా ఉండడం వల్ల పార్టీ కార్యకర్తలకు ఇవ్వలేకపోయానని చెప్పినట్లు ఎంపీ వివరించారు. ఆ నిధుల వినియోగంలో నిబంధనలు ఉంటాయని, అవి దుర్వినియోగం జరగలేదన్నారు. అంతేకాకుండా తాను ముక్కుసూటిగా ఉండటంతో పార్టీలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు నచ్చడం లేదంటూ, ఓర్వలేకనే ఇలా చేశారని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీలో కలకలం కలిగించింది.

ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారు

- కుటుంబీకులతో కలిసి మహిళ ఆందోళన
- అత్తారింటి ఎదుట ధర్నా



ఆందోళన చేస్తున్న నేరడి లత, కుటుంబీకులు

సారంగాపూర్: తన భర్త చనిపోయి నాలుగేళ్లయినా రావల్సిన ఆస్తిని పంపకాలు చేయడం లేదని మహిళ ఆందోళనకు దిగింది. మండలంలోని ధని గ్రామంలో ఆదివారం తన కుటుంబీకులతో కలిసి అత్తారింటి ఎదుట ధర్నా చేపట్టింది. టెంటు వేసుకుని భీష్మించుకు కూర్చుంది. ఆస్తి పంపకాలు చేయకుండా తన మరదలు అడ్డుకుని వేధిస్తున్నారని ఆరోపించింది. ఆందోళనకు దిగిన నేరడి లత తెలిపిన వివరాలు.. తన భర్త సురేందర్‌కు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. సురేందర్ నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. ఆ సమయంలో మామ గజ్జన్న.. ఆస్తిని ముగ్గురు సమంగా పంపకాలు చేసుకోవాలని, ఉన్న అప్పులు తీర్చాలని పత్రాలు రాయించాడు. రెండేళ్ల క్రితం గజ్జన్న మృతి చెందాడు. కాగా, లతకు ముగ్గురు కూతుళ్లు. పెద్దకూతురుకు అలేఖ్య వివాహం చేయడానికి దాదాపు రూ.8 లక్షల వరకు అప్పు చేసింది. హర్షిణి మానసిక వికలాంగురాలు. ఆరాధ్య, హరిణిల చదువులకు ఇబ్బంది పడుతున్నానని గ్రామస్తులు, పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఫలితం లేకపోయింది. ఓ సారి తనతోపాటు పిల్లలపై దాడి చేస్తే నిర్మల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని లత తెలిపారు. అయినా ఆస్తి పంచకుండా ఇద్దరు మరదలు కలిసి తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.

మహిళపై లైంగికదాడి.. హత్య

- మద్యం మత్తులో కామాంధుల అఘాయిత్యం
- చంపి.. వ్యవసాయబావిలో పడేసి
- ధనోరా శివారులో ఆలస్యంగా వెలుగులోకి..
- సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల్లో ఒకరి అరెస్టు
- ఉట్నూర్‌కు తరలింపు. డీఎస్పీ విచారణ



కుడ్మేత జంగుబాయి (ఫైల్)



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: ముగ్గురు కామంధులు మద్యం మత్తులో ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడి ఆపై హత్య చేశారు. మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గుర్తుతెలియని మృతదేహాన్ని నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన కుడ్మేత జంగుబాయి (35)గా కుటుంబీకులు గుర్తించారు. తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడు కుడ్మేత భీంరావ్ ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. భర్త కుడ్మేత నారాయణ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ పోషణ నిమిత్తం జంగుబాయి గ్రామ, వారసంతల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తోంది. వారం క్రితం జంగుబాయి తల్లిగారిల్లు అయిన దనోరా(బి) గ్రామానికి వచ్చి ఈనెల 20న వెళ్లిపోయింది. బంధువులు కూడా ఆమె తన గ్రామానికి వెళ్లిపోయి ఉండవచ్చని అనుకున్నారు. కాగా, శనివారం దనోరా(బి) శివారులోని వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం లభ్యమైంది. కాగా, పోలీసులు గ్రామ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను పరిశీలించారు. మంగళవారం రాత్రి 12 గంటల తర్వాత గ్రామపొలిమేరలో జంగుబాయిను గ్రామానికి చెందిన పసరే సంతోష్, సముక్‌రావ్ సంతోష్, షేక్ ఖదీర్‌లు రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. లైంగికదాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సీసీ పుటేజీల్లో గుర్తించిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ నాగేందర్ విచారిస్తున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నిందితులను ఉరితీయాలని మృతురాలు బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఆదివాసీ సంఘాల డిమాండ్
- ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా



నాయకులను సముదాయిస్తున్న డీఎస్పీ

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం ధనోర(బి) శివారులో ఆదివాసీ మహిళను లైంగిక దాడి చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట మృతురాలి కుటుంబీకులతో కలిసి నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గణేశ్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు లైంగికదాడి చేసి హత్య చేసి బావిలో పడేశారన్నారు. నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుమారుడు భీంరావును ఆదుకోవాలన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేందర్ అక్కడికి చే రుకుని వారిని సముదాయించారు. అనంతరం సంఘాల నాయకులు, కుటుంబీకులు ఐటీడీఏ పీవో వ రుణ్‌రెడ్డిని కలిశారు. మృతురాలి కుమారుడికి చదువుతోపాటు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్కబాపురావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, ఆదివాసీ సంఘాల నాయకులు సోయం లలిత, మర్సుకోల తిరుపతి, పెందూర్ దత్తు, కాత్లే పృథ్వీరాజ్, సునీల్ జాదవ్, సెడ్మకి భీంరావు తదితరులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారిపై కత్తులతో దాడి

ఆదిలాబాద్‌టౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరో రియల్ వ్యాపారిపై కత్తులతో దాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ఖానాపూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జహీర్‌ఖాన్ జేకే ఇంతియాజ్ వద్ద మూడు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్లను పట్టణానికి చెందిన పత్తి ముజ్జుకు విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించగా, మిగతావి చెల్లించాల్సి ఉంది. అయితే రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నాడు. శనివారం జహీర్‌ఖాన్ ఆయనకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే ఫోర్‌పిట్ చేస్తానని తెలిపాడు. దీంతో పత్తి ముజ్జు తన స్నేహితులు ఆదిల్, ఆబిద్, ఇస్మాయిల్, అతిఖ్, మరో నలుగురితో రాత్రి 10 గంటల సమయంలో జహీర్‌ఖాన్ ఇంటికెళ్లి ఆయనపై కత్తులతో దాడి చేశారు. కుడి చేయికి గాయం కావడంతో అడ్డొచ్చిన ఆయన భార్య చీర సైతం చిరిగింది. బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అనారోగ్యంతో దళిత నాయకుడి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే జోగు రామన్న



అంత్యక్రియలో పాల్గొన్న గ్రామస్తులు

జైనథ్: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు ఈర్గల గంగన్న అనారోగ్యంతో మృతిచెందాడు. దళితుల హక్కుల కోసం ఏళ్లుగా కృషి చేస్తున్న గంగన్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని మరణవార్త తెలిసిన ఎమ్మెల్యే జోగు రామన్న ఆదివారం జైనథ్‌కు వచ్చి నివాళులర్పించారు. కుటుంబీకులతో మాట్లాడి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంగన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేశ్, గ్రామస్తులు భారీగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఊరికి ఉపకారం

- సొంత ఖర్చుతో మంచినీటి బావి నిర్మాణం
- విశ్రాంత ఉపాధ్యాయుడి ఔదార్యం



తవ్వించిన బావి వద్ద రిటైర్డ్ టీచర్ ప్రకాశ్‌రావు దంపతులు

నెన్నెల: ఆకలితో అలమటించే సమయానికి బుక్కెడు అన్నం... దాహంతో ఉన్న వారికి గుక్కెడు నీరు అందిస్తే అంతకన్న మించిన సేవ, సాయం మరొకటి లేదు. ప్రార్థించే చేతులకన్న.. సాయం చేసే చేతులు మిన్న అనే నానుడిని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జెడ్పీఎస్ఎస్ రిటైర్డ్ టీచర్ దండనాయకుల ప్రకాష్‌రావు నిజం చేశారు. మైలారం గ్రామంలోని పెద్దవాడలోని బోరు పాడైంది. మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీళ్లు రాక నీటి కోసం అల్లాడుతున్న గిరిజనుల బాధలు చూసి రూ.30వేలతో బావి తవ్వించాడు. సమాజం మనకు ఏమి ఇచ్చిందనేది కాదని, మనం సమాజానికి ఏమిచ్చామనేదే ముఖ్యం అంటున్నారని ప్రకాశ్‌రావు. మా నాన్న సుగుణాకర్‌రావు ప్రధానోపాధ్యాయుడిగా నెన్నెల హైస్కూల్‌లోనే విద్యను బోధించారని, ఆయన సైతం గిరిజనుల కోసం మైలారంలోని చిన్నవాడలో బావి తవ్వించారని, తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ఊరి కోసం తనకు తోచిన విధంగా బావి తవ్వించినట్లు చెబుతున్నాడు. ఇలాంటి సేవలు మరిన్ని చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం



పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు



ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న భక్తులు

- వేలాలలో భక్తుల సందడి
- పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా తొలి ఏకాదశ సందర్భంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రెండ్రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజున శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు పవిత్ర గోదారి నదిలో స్నానం చేయించారు. అనంతరం ఆదివారం ఉదయం ఆలయంలో గొల్లపూజారులు, ఒగ్గుపూజారులు సంప్రదాయబద్ధంగా పెద్దపట్నం వేసి శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు కనుల పండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం వీక్షించడానికి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో వేలాల సందడిగా మారింది. అనంతరం అగ్నిగుండాలు నిర్వహించగా మల్లన్న స్వామి భక్తులు నిప్పులపై నుంచి నడిచారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్, ఎంపీటీసీ రాజేశ్వరి రాజబాపు, ఉప సర్పంచ్ డేగ నగేశ్ పాల్గొన్నారు.

ఆరుద్ర పురుగుల ఆగమనం

నెన్నెల/భీమారం: వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్రకార్తె అనుకూలమైంది. సంవత్సరంలో ఆరుద్రకార్తెలో మాత్రమే ఆరుద్ర పురుగు కనిపిస్తుంది. ఆరుద్ర కార్తెకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. చూడగానే ముద్దు వచ్చే రూపంతో నెన్నెల, భీమారం శివారులోని చేనుల్లో ఆదివారం ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. ఈ నెల 23న ఆరుద్ర కార్తె ప్రారంభమైంది. ఈ పురుగులు ఆగమనాన్ని రైతులు శుభసూచికంగా భావిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నెన్నెల శివారులో కనిపించిన ఆరుద్ర పురుగులు